క్లుప్తంగా

మల్లేశ్వరస్వామి గుడి అభివృద్ధి పనుల పరిశీలన



భవానీపురం(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై ఉన్న మల్లేశ్వరస్వామి ఆలయం వద్ద శరవేగంతో జరుగుతున్న ఆలయ అభివృద్ధి పనులను సోమవారం ఆలయ కార్యనిర్వహణాధికారి కేఎస్ రామారావు పరిశీలించారు. అభివృద్ధి పనుల పురోగతి గురించి ఇంజినీరింగ్ అధికారులను అడిగి తెలుసుకుని పలు సూచనలు చేశారు. మల్లేశ్వర స్వామివారిని దర్శించుకునేందుకు వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు అసౌకర్యం కలుగకుండా పనులను మరింత వేగవంతం చేయాలని సూచించారు.

రామలింగేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు



పెనమలూరు: యనమలకుదురు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ పార్వతీ సమేత శ్రీరామలింగేశ్వరస్వామివారి దేవస్థానంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాసశివ రాత్రి సందర్భంగా ఆలయంలో ఉదయం 6.30 గంటలకు రుద్రాభిషేకం, 8 గంటలకు ఏకాదశ రుద్రాభిషేకం, అనంతరం స్వామివారి అలంకరణ చేశారు. ఆలయ శివ సౌధంలో స్వామివారికి కల్యాణోత్సవం నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని కల్యాణోత్సవాన్ని తిలకించారు. స్వామివార్లను దర్శించుకొని పూజలు చేశారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

అధిక శాతం ఓటింగ్ జరిగేలా చర్యలు తీసుకోవాలి



మైలవరం: 2024 ఎన్నికల్లో అధిక శాతం ఓటింగ్ జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని మైలవరం, నందిగామ, జగ్గయ్యపేట అసెంబ్లీ నియోజకవర్గాల సాధారణ పరిశీలకులు నరీందర్ సింగ్ బాలి అన్నారు. మైలవరం, పుల్లూరు, వెల్వడం, గణపవరం, చంద్రాల గ్రామాలలోని పోలింగ్ కేంద్రాల్లో చేసిన ఏర్పాట్లను సోమవారం నరేందర్ సింగ్ బాలి పరిశీలించి మాట్లాడారు. పోలింగ్ కేంద్రాల్లో విద్యుత్, ఫ్యాన్లు, తాగునీరు, మరుగుదొడ్లు, షామియానా వసతులు సక్రమంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని బీఎల్ఓలకు సూచించారు. అధిక శాతం పోలింగ్ జరిగేట్లుగా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. మైలవరంలోని లకిరెడ్డి హనిమిరెడ్డి ఇండోర్ స్టేడియంలో ఉన్న ఈవీఎం మాక్ పోల్ సెంటర్, లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఎలక్షన్ స్టాఫ్ శిక్షణ తరగతులను, పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటేషన్ సెంటర్‌లో పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియను పరిశీలించి సంతృప్తి వ్యక్తంచేశారు. జాయింట్ కలెక్టర్ సంపత్‌కుమార్, మైలవరం తహసీల్దార్ రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆరుగురు జూదరుల అరెస్ట్

పెనమలూరు: పేకాట ఆడుతున్న ఆరుగురు జూదరులను పోలీసులు సోమవారం అరెస్ట్ చేశారు. పెనమలూరు సీఐ టీవీవీ రామారావు తెలిపిన వివరాల ప్రకారం పెదపులిపాక గ్రామ పరిధి ఖాళీ స్థలంలో ఆరుగురు వ్యక్తులు పేకాట ఆడుతుండగా పోలీసులు వారిని అదుపులోకి తీకున్నారు. వారి వద్ద రూ.5,210 నగదును స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేశామని చెప్పారు.

తనిఖీలు ముమ్మరం చేయాలి

తిరువూరు: సార్వత్రిక ఎన్నికల పోలింగ్ సమీపిస్తున్నందున అంతర్రాష్ట్ర చెక్‌పోస్టు వద్ద తనిఖీలు ముమ్మరం చేయాలని విజయవాడ పార్లమెంటరీ నియోజకవర్గ వ్యయ పరిశీలకులు వి.జస్టిన్ అధికారులను ఆదేశించారు. తిరువూరు నియోజకవర్గంలోని ఖమ్మం జిల్లా రాజవరం రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టు వద్ద వాహనాల తనిఖీ ప్రక్రియను ఆయన సోమవారం పరిశీలించారు. తెలంగాణ నుంచి రాష్ట్రంలోకి ప్రవేశించే ప్రతి వాహనాన్ని సమగ్రంగా తనిఖీ చేయాలని ఆదేశించారు.

సర్టిఫికెట్లు అందజేత

మైలవరం: మైలవరం డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈడీఎక్స్ కోర్సు పూర్తి చేసిన ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేశామని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఇళ్ల రవి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈడీఎక్స్ కోర్సు ద్వారా అంతర్జాతీయంగా వివిధ యూనివర్సిటీలకు చెందిన సర్టిఫికెట్ కోర్సులను కళాశాల విద్యార్థులు పూర్తి చేశారన్నారు. కార్యక్రమంలో ఈడీఎక్స్ కోర్స్ కో–ఆర్డినేటర్ బి. సుభాషిణి, ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల కెమిస్ట్రీ అధ్యాపకులు బాలసుబ్రహ్మణ్యం, కె.శ్యామ్‌సుందర్, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

బాబు మేనిఫెస్టోను ప్రజలు నమ్మటం లేదు



వించిపేటలో సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న ఆసిఫ్



వృద్ధురాలికి కరపత్రం అందించి ఓటు అభ్యర్థిస్తున్న ఆసిఫ్ తదితరులు

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థి షేక్ ఆసిఫ్

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): చంద్రబాబు ప్రవేశపెట్టిన మేనిఫెస్టోను ప్రజలు నమ్మటం లేదని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థి షేక్ ఆసిఫ్ అన్నారు. అందువలనే ల్యాండ్ టైటిలింగ్ చట్టం వంటి అంశాలపై ప్రజలను చంద్రబాబు తప్పుదోవ పట్టిస్తున్నారని తెలిపారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా 54వ డివిజన్ కార్పొరేటర్ అబ్దుల్ ఆర్షద్ ఆధ్వర్యంలో షేక్ ఆసిఫ్ వించిపేట తదితర ప్రాంతాల్లో సోమవారం విస్తృతంగా పర్యటించారు. వించిపేట గాంధీ బొమ్మ సెంటర్, ఆరు పంపులు బాయ్ వీధుల నుంచి కొండ ప్రాంతాల్లో ప్రతి గడపకు వెళ్లి జగనన్న హయాంలో చేసిన అభివృద్ధి, సంక్షేమం చూసి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని కోరారు. చంద్రబాబు చెప్పేడు మాటల వినవద్దని సూచించారు. ఈ సందర్భంగా షేక్ ఆసిఫ్ మాట్లాడుతూ ఎన్నికలు దగ్గర పడేకొద్దీ పశ్చిమ నియోజకవర్గంపైకి పెత్తందారు ముఠాలు ఒక్కొక్కటిగా దండయాత్ర చేస్తున్నాయని తెలిపారు. బ్యాంకులను మోసం చేసి కొల్లగొట్టిన డబ్బు మూటలతో వచ్చి ప్రజలను మభ్యపెట్టేందుకు శతవిధాలా ప్రయత్నాలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. బీజేపీ ఎంతగా దిగజారిందంటే ప్రజలను తమకు ఓటు వేయండని కోరడం లేదన్నారు. మీరు డబ్బులు తీసుకుని ఓటు వేయకుండా ఇంట్లో ఉండండి అని చెబుతున్నారని వివరించారు. ఇది ప్రజల హక్కులను కాలరాయడమేనన్నారు. రాజ్యాంగ స్ఫూర్తికి తూట్లు పొడవటమేనని పేర్కొన్నారు. ప్రజలందరూ ఆలోచించాలని కోరారు.

సామాన్యుడిని ఎదుర్కోలేక....

ఒక సామాన్యుడినైన ఆసిఫ్‌ను ఎదుర్కోలేక ప్రజల ఓటు హక్కునే హరిస్తారా అని ప్రశ్నించారు. సుజనా చౌదరికి చిత్తశుద్ధి ఉంటే సామాజికంగా, ఆర్థికంగా అత్యంత వెనుకబడిన ముస్లింలకు మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి కల్పించిన రిజర్వేషన్‌ను రద్దు చేయబోమని విజయవాడ వస్తున్నటువంటి ప్రధానమంత్రి మోదీతో ప్రకటన చేయించాలని కోరారు. ప్రజలకు కాకమ్మ కబుర్లు చెప్పవద్దని హితవు పలికారు. మీ మాయమాటలు నమ్మడానికి, మీరు చెబితే ఓటు వేయకుండా ఇంట్లో కూర్చోవడానికి పశ్చిమ నియోజకవర్గం ప్రజలు సుజనా కంపెనీ ఉద్యోగులు కాదని ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు అబ్దుల్‌వహాబ్, అహ్మద్‌భాయ్ (చందన్), క్వాలిటీ ఖాదర్, ఎస్కే సలీంబాషి, జీఎంసీ అల్తాఫ్, నజీర్, అహ్మద్, శభాషి, మన్సూర్, డి.శివ తదితరులు పాల్గొన్నారు.

12న ఆదిశంకరుల జయంతి ఉత్సవం



విజయవాడ కల్చరల్: శృంగేరీ పీఠపాలిత శివరామ కృష్ణ క్షేత్రంలో శృంగేరీ పీఠాధిపతులు భారతీ తీర్థ మహాస్వామి, విధుశేఖర భారతి ఆదేశంతో శివరామ కృష్ణ క్షేత్రంలో ఈ నెల 12వ తేదీ ఆదివారం ఆదిశంకరుల జయంతి ఉత్సవాలు నిర్వహిస్తునట్లు ధర్మాధికారి శిష్టా హనుమత్ ప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆరోజు ఆదిశంకరులకు ప్రత్యేక పూజలు, ఆధ్యాత్మిక వేత్త శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రితో ఆదిశంకరులు రచించిన ప్రస్థాన త్రయ భాష్యం, బ్రహసూత్రములు, శ్రీమద్ భగవద్గీత ఉపనిషత్‌లు అంశంగా ప్రసంగాలు ఉంటాయని పేర్కొన్నారు. 13వ తేదీ ఆదిశంరుల చిత్రపటంతో శోభాయాత్ర నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

శారదా చంద్ర మౌళీశ్వర స్వామి దేవస్థానంలో..

కృష్ణామండల వేద విద్వత్ ప్రవర్ధక సభ ఆధ్వర్యంలో ఈ నెల 10వ తేదీ నుంచి మూడురోజులపాటు శంకర జయంతి సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వేద సభ అధ్యక్షుడు మాగంటి వేణుగోపాల్, దేవాలయ మేనేజర్ శర్మ సోమవారం ఒక ప్రటనలో తెలిపారు. 10 , 11, 12 తేదీల్లో వేద విద్యార్థులకు పరీక్షలు, 76వ వేద సభ వార్షిక సమావేశాలు, నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ముగింపు సభలో తిరుపతి వేద విశ్వవిద్యాలయం వైస్‌చాన్సలర్ గుళ్లపల్లి శ్రీ రామకృష్ణమూర్తి, దుర్గామల్లేశ్వర స్వామి దేవస్థానం కార్యనిర్వహణ అధికారి కేఎస్ రామరావు పాల్గొంటారని తెలిపారు.

సుజనాను వెన్నాడుతున్న ఓటమి భయం

- అడుగడుగునా ప్రలోభాలకు పాల్పడుతున్న వైనం
- డబ్బులు ఎర
- మసీదులకు డబ్బులు పంపిన సుజనాను ఛీ కొడుతున్న ముస్లింలు
- పోస్టల్ ఓట్లలోనూ భారీగా డబ్బు పంచినట్లు ఆరోపణ



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ఓటమి భయం వెన్నాడుతుండటంతో విజయవాడ పశ్చిమ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న సుజనాచౌదరి అడుగడుగున ప్రలోభాలకు తెగబడుతున్నారు. ఎన్నికలు సమీపిస్తున్నందున ప్రతి చోటా ఎదురుగాలి వీస్తుండటంతో ఆయన బెంబేలెత్తుతున్నారు. నియోజకవర్గంలో అత్యధికంగా ఉన్న వర్గాలు ఆ పార్టీకి దూరంగా ఉండటంతో దిక్కుతోచని స్థితిలో డబ్బుతోనే ఎన్నికల్లో విజయం సాధించాలనే కుయుక్తులు పన్నుతున్నారు. అందులో భాగంగానే ఓట్లు కొనుగోలు చేయటానికి భారీగా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారని సమాచారం. ముందస్తుగా పోస్టల్ బ్యాలెట్లకు సంబంధించి మూడు రోజులుగా నియోజకవర్గం వ్యాప్తంగా ఓట్లు కొనుగోలుకు అనేక బృందాలు పని చేశాయి. విచ్చలవిడిగా డబ్బులు వెదజల్లుతున్నాయనే ఆరోపణలు విన్పించాయి. ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బంది పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకుంటారు. వారిని ఎన్‌జీవో నేతల సాయంతో గుర్తించి కొనుగోలు చేయటానికి నానా తంటాలు పడుతున్నారు.

నాయకులకు తాయిలాలు...

నియోజకవర్గంలోని వివిధ పార్టీలకు చెందిన నాయకులకు భారీగా తాయిలాలు ఆశచూపి కొనుగోలు చేసిన విషయం అందరికీ తెలిసిందే. పశ్చిమ నియోజకవర్గంలో వివిధ పార్టీలకు నగర అధ్యక్షులుగా పని చేసిన వారు, పలు కార్యాలయాలకు అధ్యక్షులుగా పని చేస్తున్నవారు, కుల సంఘాల నేతలను సుజనాచౌదరి అడ్డగోలుగా కొనుగోలు చేశారని ప్రచారం జరుగుతోంది. అలాగే కొన్ని కులాలకు చెందిన రాజకీయ నాయకులను సైతం కొనుగోలు చేశారని సీనియర్ నాయకులు వ్యాఖ్యానిస్తున్నారు. ఇస్తామన్న సొమ్ములో పదో వంతు చేతిలో పెట్టి ఆ తరువాత వారి గురించి పట్టించుకోవటం మానేశారని చెబుతున్నారు. పార్టీలో చేరిన పెద్ద నాయకులుగా చెబుతున్న నేతలంతా గతంలో పలుమార్లు కార్పొరేటర్లుగా పోటీ చేసి డిపాజిట్లు కూడా రాని నాయకులని తెలియటంతో సుజనాచౌదరి వారిని పట్టించుకోవటం లేదని తెలిసింది.

సుజనాను ఛీ కొడుతున్న ముస్లింలు...

పశ్చిమ నియోజకవర్గంలోని కొన్ని మసీదులకు టీడీపీ నేతలు డబ్బులు పంపించారని అక్కడి ఇమామ్‌లకు, మౌజాన్‌లకు వేలాది రూపాయలను బీజేపీ నేతలు చేరవేశారు. టీడీపీ పంపినట్లుగా స్థానిక ముస్లిం నేతలు ఒకరిద్దరు చెప్పటంతో వారు ఆ మొత్తాలను అందుకున్నారు. అయితే బీజేపీకి చెందిన సుజనాచౌదరి నుంచి ఆ డబ్బులు వచ్చాయని తెలియటంతో ఇమామ్‌లు, మౌజాన్‌లు తమకు డబ్బు ఇచ్చిన వ్యక్తులను పిలిచి ఆ మొత్తాలను వెనక్కి ఇచ్చి బూతులు తిట్టి పంపినట్లు తెలిసింది. ఒకవైపు తమపై దాడులకు తెగబడుతుంటే వారి నుంచి మేం ఎలా డబ్బులు తీసుకుంటామని కొంతమంది ముస్లిం పెద్దలు గట్టిగా అరిచినట్లు సమాచారం. మీకు అమ్ముడుపోయే వ్యక్తులు ఉండచ్చు కానీ మా ఆత్మగౌరవాన్ని మీకు అమ్ముకోలేం అంటూ ఇమామ్‌లు, మౌజాన్‌లు సైతం ఎదురు తిరగటంతో సుజనా తాలుకా వ్యక్తులు అల్లరి కాకూడదని అక్కడి నుంచి చిత్తగించారని ముస్లిం సంఘాల నేతలు అంటున్నారు.

శతక పుస్తకాల ఆవిష్కరణ

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఉప్పులూరి భారతీ దేవి ద్వితీయ వర్ధంతి పురస్కరించుకుని ముత్యాలంపాడు శ్రీమారుతీగ్యాస్ కంపెనీ ప్రాంగణంలో సోమవారం శతకశ్రీ ఉప్పులూరి లక్ష్మీనారాయణ రచించిన కాశీ అక్షయ మోక్షము, శ్రీసుందర బాలరామ అఖండ వాత్సలి శతక పుస్తకాలను మారుతీగ్యాస్ కంపెనీ అధినేత డాక్టర్ చెట్లపల్లి మారుతీ ప్రసన్న ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మారుతీప్రసన్న మాట్లాడుతూ లక్ష్మీనారాయణ రచనలను అభినందించారు. రిటైర్డ్ బీఎస్ఎన్ఎల్ డీఈ ఎస్.నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన శతకముల ఆవిష్కరణ కార్యక్రమంలో పాలపర్తి శ్యామలానందప్రసాద్ పాల్గొని సుందర బాలరామ శతక, వైశిష్ట్యం, రామ ధర్మం, నీతి, పరిపాలన, పితృ, మాతృ, వాత్సలన, గురు భక్తి, భాతృప్రేమ, దుష్ట శిక్షణ, ముని రక్షణ, ఏక పత్నీ వ్రత విశేషాలు, హృద్యంగా వివరించారు. జంధ్యాల పరదేశిబాబు కాశీ క్షేత్ర అక్షయ మోక్ష శతక సమీక్ష, రమణీయంగా వర్ణించారు. కాశీ విశిష్టత, గంగా ప్రాభవం, విశ్వనాథవైభవం, అన్నపూర్ణ, విశాలక్ష్మి మాతల, విభవం, తదితర, అంశాలు, బహు, హృదయ రంజకంగా వర్ణించారు. అనంతరం అయోధ్య సుందర బాలరామ పద్య శతకాన్ని భారతి మాతకు అంకితం చేశారు. అనంతరం రచయిత ఉప్పులూరి లక్ష్మీనారాయణను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మాడుగుల రామకృష్ణ, రమణమూర్తి డాక్టర్ బ్రహ్మదేశం సోషల్ సర్వీస్ సొసైటీ కోశాధికారి గుర్రం ఏడు కొండలు, కోరంగి మల్లీశ్వరి తదితరులు పాల్గొన్నారు. తొలుత పెద్దిబొట్ల జానకీ దేవి జ్యోతి ప్రజ్వలన చేశారు.



కాశీ అక్షయ మోక్షము, శ్రీసుందర బాలరామ అఖండ వాత్సలి శతకాలు ఆవిష్కరిస్తున్న దృశ్యం

సైబర్ నేరాల నివారణపై అవగాహన

ఆటోనగర్(విజయవాడతూర్పు): సైబర్ నేరాల నివారణపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచ్ ఏజీఎం వీఎస్ ప్రసాద్ రెడ్డి తెలిపారు. వన్‌టౌన్‌లోని స్టేట్‌బ్యాంకు మెయిన్ బ్రాంచ్‌లో సైబర్ సెక్యూరిటీపై ఖాతాదారులకు సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ ఇటీవల సైబర్ నేరాలు తీవ్రంగా నెలకొన్నాయని చెప్పారు. ఈ విషయమై ప్రతి ఒక్కరూ తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఈ సందర్భంగా కెవైసీ, క్రెడిట్ అండ్ డెబిట్ కార్డ్, ఎలక్ట్రిసిటీ బిల్లులతో పాటు ఆధార్ తంబ్‌తో డబ్బులను డ్రాచేయడం లాంటివి జరుగుతున్నాయన్నారు. అంతే కాకుండా 24 గంటలు లోను ఇస్తామని ఆన్‌లైన్ మోసాల గురించి ఆయన అర్థమయ్యే రీతిలో వివరించారు. ప్రతి ఖాతాదారుడు ఇలాంటి మోసాలను అరికట్టే విధంగా వ్యవహరించాలని సూచించారు. మోసాలు జరిగిన తర్వాత వచ్చి తమను ప్రశ్నించినా ప్రయోజనం ఉండదన్నారు. చీఫ్ మేనేజరు సుకుమార్, మేనేజరు పి.శ్రీకాంత్, లోకల్ కార్యదర్శి ఎంటీవీ రమణ పాల్గొన్నారు.



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఎస్‌బీఐ ఏజీఎం ప్రసాద్‌రెడ్డి

వైఎస్సార్ కాలనీలో జోరుగా ఎన్నికల ప్రచారం



వైఎస్సార్ కాలనీలో ఎన్నికల ప్రచారంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు

భవానీపురం(విజయవాడపశ్చిమ): రానున్న ఎన్నికల్లో విజయవాడ పార్లమెంట్ అభ్యర్థి కేశినేని శ్రీనివాస్ (నాని), మైలవరం ఎమ్మెల్యే అభ్యర్థి సర్నాల తిరుపతిరావుల విజయాన్ని కాంక్షిస్తూ జక్కంపూడి వైఎస్సార్ కాలనీలోని గొల్లపూడి 9వ సెగ్మెంట్‌లో వైఎస్సార్ సీపీ నాయకుల ప్రచారం జోరుగా సాగుతోంది. సోమవారం కాలనీలోని గడప గడపకు వెళ్లి ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి నాని, తిరుపతిరావులను గెలిపించాలని కోరుతున్నారు. ఐదేళ్లపాటు మైలవరం నియోజకవర్గ ఎమ్మెల్యేగా ఉంటూ వైఎస్సార్ కాలనీవైపు ఒక్కసారి కూడా తొంగి చూడని వసంత కృష్ణప్రసాద్ ఇప్పుడు వచ్చి చెప్పే కల్లబొల్లి కబుర్లను నమ్మవద్దని కోరారు. అబద్ధాలు చెప్పటంలో పీహెచ్‌డీ చేసిన చంద్రబాబు పార్టీలో చేరి అబద్ధాలు చెప్పటంలో అతని కంటే ఘనుడని ఎద్దేవా చేశారు. మీ కుటుంబానికి మేలు జరిగితేనే వైఎస్సార్ సీపీకి ఓటు వేయమని ధైర్యంగా చెప్పగలిగిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. సీఎం జగనన్న నాయకత్వంలోని వైఎస్సార్ ప్రభుత్వం అమలు చేసిన వివిధ సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి పొందిన సుమారు 80 శాతానికిపైగా పేదలు జగనన్న పక్షాన ఉన్నారని తెలిపారు. మరో మూడు దశాబ్దాలపాటు ఆయనే ముఖ్యమంత్రిగా సంక్షేమ, అభివృద్ధి దిశగా పాలన సాగిస్తారని వివరించారు. గొల్లపూడి ఎంపీటీసీ కొరగంజి సత్యనారాయణ, కాలనీ ఎన్నికల ఇన్‌చార్జ్ అవినాష్, బాల్‌రెడ్డి, టీఎల్ రాజు, దుర్గారావు, అర్జున్, గౌస్, ఏసు, జగదీష్, తిరుపతిరావు, రాఘవ, శ్రీను, సురేష్, రామారావు, సాయి, మస్తాన్, నాని, పఠాన్ చాందిని, ఫర్వానా తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తూ రైల్వే ఉద్యోగి మృతి



రవి మృతదేహం

రైల్వే స్టేషన్(విజయవాడ పశ్చిమ): ప్రమాదవశాత్తూ రైల్వే ఉద్యోగి మృతి చెందిన సంఘటన సోమవారం చోటు చేసుకుంది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... విజయవాడ రైల్వే డివిజన్ గన్నవరం–చెరువు మాధవరం మధ్య రైల్వే ట్రాక్‌పై విధులు నిర్వర్తిస్తున్న విజయవాడ గొల్లపాలెం గట్టుకు చెందిన చెల్ల రవి (29) అదే ట్రాక్‌పై వస్తున్న ట్రాస్ కార్ (రైల్వే విద్యుత్ లైన్ మరమ్మతులు చేసే కార్) ఢీ కొనటంతో మృతి చెందినట్లు రైల్వే పోలీసులు తెలిపారు. విజయవాడ రైల్వే సూపరింటెండెంట్ జి.రామకృష్ణ ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి మృత దేహాన్ని ప్రభుత్వ అసుపత్రికి తరలించి దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

ఎన్నికల సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

మైలవరం: ఎన్నికల సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఎన్టీఆర్ జిల్లా జాయింట్ కలెక్టర్, మైలవరం నియోజకవర్గ ఎన్నికల అధికారి పి. సంపత్‌కుమార్ అన్నారు. మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల ప్రాంగణంలో ఎన్నికల సిబ్బందికి రెండో రోజు సోమవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. సంపత్‌కుమార్ పాల్గొని నమూనా ఎలక్షన్ నిర్వహించి అధికారులకు ఈవీఎంలు, వీవీ ప్యాట్ల పనితీరుపై అవగాహన కల్పించారు. మంగళవారం ఆర్ఓ కార్యాలయం వద్ద ఓటర్ ఫెసిలిటేషన్ కేంద్రం ఏర్పాటు చేశామన్నారు. ఇంకా ఎవరైనా తమ ఓటు హక్కును వినియోగించుకోని సిబ్బంది ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

మహిళ పట్ల అసభ్యకర ప్రవర్తన

ఐదుగురు బిహార్ యువకుల అరెస్ట్

ఉయ్యూరు: ఒంటరిగా వెళ్తున్న మహిళ పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన యువకులను ఉయ్యూరు పోలీసులు సోమవారం అరెస్టు చేసి కోర్టుకు హాజరుపరిచారు. నిందితులను సోమవారం రాత్రి మీడియా ఎదుట హాజరుపరిచారు. ఎస్ఐ గణేష్‌కుమార్ తెలిపిన కథనం మేరకు.. మండలంలోని గండిగుంట గ్రామానికి చెందిన మహిళ ఆదివారం అర్ధ రాత్రి షాపు మూసివేసి ఇంటికి వెళ్తున్న సమయంలో గండిగుంట ఎస్సీకాలనీ సమీపానికి చేరుకోగానే పట్టణంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో గేదెల పాకలో పనిచేసే ఐదుగురు బిహార్ యువకులు ఆమె పట్ల అసభ్యకరంగా ప్రవర్తించి దౌర్జన్యానికి పాల్పడ్డారు. ఘటనలో ఐదుగురు యువకులను అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేసి కోర్టుకు హాజరుపరిచారు. ఈ ఘటనకు సంబంధించి కొందరు వ్యక్తులు చట్టాన్ని అతిక్రమించి స్కూల్ ప్రాంగణంలోకి ప్రవేశించి అక్కడ పనిచేసే సిబ్బందిని భయభ్రాంతులకు గురిచేశారు. పలువురు సిబ్బంది గాయపడ్డారు. పరస్పర ఫిర్యాదులు నమోదు చేసి కేసు దర్యాప్తు చేస్తున్నామని, త్వరలోనే నిందితులను అరెస్ట్ చేస్తామని పోలీసులు పేర్కొన్నారు.



నిందితులను హాజరుపర్చిన పోలీసులు

చైన్ స్నాచింగ్‌పై కేసు నమోదు

హనుమాన్‌జంక్షన్‌రూరల్: బాపులపాడు మండలం రేమల్లేలో జరిగిన చైన్ స్నాచింగ్ ఘటనపై వీరవల్లి పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళ్లితే.. ఈ నెల 4న గ్రామానికి చెందిన ఈడే అక్కయ్య భార్య అగ్నేసమ్మ ఇంటి వద్ద ఉండగా ఇద్దరు యువకులు బైక్‌పై వచ్చి తాగటానికి మంచి నీళ్లు అడిగారు. ఆమె తాగునీరు ఇచ్చేందుకు దగ్గరకు రాగానే హఠాత్తుగా మెడలోని బంగారు గొలుసు లాక్కుని బైక్‌పై పరారయ్యారు. ఈ ఘటనపై ఆందోళన చెందిన అగ్నేసమ్మ పెద్దగా కేకలు వేస్తూ వెంబడించినా ప్రయోజనం లేకపోయింది. దీంతో సోమవారం వీరవల్లి పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. ఐదు కాసుల విలువైన బంగారు గొలుసు దొంగిలించినట్లుగా ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ఘటనపై వీరవల్లి ఎస్ఐ చిరంజీవి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా పాలన

ఎంపీ అభ్యర్థి కేశినేని నాని

ఇబ్రహీంపట్నం: అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఐదేళ్లుగా సుపరి పాలన చేశారని విజయవాడ ఎంపీ అభ్యర్థి, ఎంపీ కేశినేని నాని అన్నారు. పశ్చిమ ఇబ్రహీంపట్నం, మూలపాడులో మైలవరం ఎమ్మెల్యే అభ్యర్థి సర్నాల తిరుపతిరావుతో కలిసి సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రామంలో భారీ రోడ్ షో జరిపారు. అడుగడుగున ప్రజలు బ్రహ్మరథం పట్టారు. హారతులిచ్చి ఆత్మీయ స్వాగతం పలికారు. వారు మాట్లాడుతూ జగనన్న పథకాలతో ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూరిందన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో ఏ అవసరం వచ్చినా కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేదని చెప్పారు. సచివాలయాలు, వలంటీర్ వ్యవస్థతో అవినీతికి తావులేకుండా పథకాలను ఇంటివద్దకే జగన్ ప్రభుత్వం అందించిందన్నారు. 2019 మేనిఫెస్టోను 99 శాతం అమలు చేశారని చెప్పారు. సంక్షేమ పథకాలు అమలు కావాలంటే మరలా సీఎంగా జగనన్న రావాలన్నారు. టీడీపీ మేనిఫెస్టో ప్రజలను మోసం చేసేలా ఉందన్నారు. టీడీపీ నాయకులు కల్లబొల్లి మాటలతో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలను లొంగదీసుకునే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. వైఎస్సార్ సీపీ అభ్యర్థులుగా నాకు, తిరుపతి రావుకు ఫ్యాన్ గుర్తుపై రెండు ఓట్లు వేసి విజయం చేకూర్చాలని కోరారు. పరిశీలకులు నాగిరెడ్డి, జెడ్పీ వైస్ చైర్మన్ గరికపాటి శ్రీదేవి, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు జోగి వెంకటేశ్వరరావు, బట్టరాజ కార్పొరేషన్ డైరెక్టర్ పోరంకి పద్మావతి, ఎస్.శివశంకరరావు, పోతురాజు, మేడపాటి నాగిరెడ్డి పాల్గొన్నారు.



పశ్చిమ ఇబ్రహీంపట్నంలో ప్రచారం చేస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు కేశినేని నాని, తిరుపతిరావు

యువతకు తీన్మార్ బ్యాండ్ వితరణ



గన్నవరంరూరల్: మండలంలోని సూరంపల్లి శివారు గ్రామం రామచంద్రాపురానికి చెందిన యువతకు సూరంపల్లి తోట సీతారావమ్మ, సీతారామయ్య చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో చైర్మన్ తోట వెంకయ్య సోమవారం వితరణగా రూ.60 వేలు విలువైన తీన్మార్ బ్యాండ్ ఫుల్‌సెట్ అందజేశారు. వీటిని ట్రస్ట్ సభ్యులు తోట విజయ్‌కుమార్ వారికి అందజేశారు. ఈ సందర్భంగా వెంకయ్య మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో యువత ఉద్యోగాలు, ఉపాధితో పాటు సాంస్కృతికంగా ఎదగాలన్న ఆకాంక్షతో వారిలోని ఆసక్తిని గమనించి ఈ సహాయం అందజేశామన్నారు. యువత తీన్మార్ ద్వారా మరింత ఉపాధిని సాధిస్తారని ఆకాంక్షించారు. కార్యక్రమంలో నాయకులు కందిమళ్ల శ్రీనివాసరావు, ప్రత్తిపాటి రాజా, తుల్లిమిల్లి ఏడుకొండలు, పామర్తి మాధవరావు, కందిమళ్ల రాఘవ, కూరాకుల కోటేశ్వరరావు, కోటగిరి ప్రసాద్, కోటగిరి రాజాబాబు, బండి వెంకటేశ్వరరావు, తోట ప్రశాంత్, సర్నాల లక్ష్మణరావు, సర్నాల రాంబాబు పాల్గొన్నారు.